# పగ

**శ్రీ పి. జీ. రామారావు**

అంత పెద్దపాముని నేనంతకుముందెప్పుడూ చూడలేదు. హరికెన్‌లాంతరు వెల్తురులో సుమారు రెండు గజాల పొడవున మిల మిల మెరుస్తూ, ఎంత అందంగాఉందో అంత భయంకరంగా బతికున్న పామేమోనన్న భ్రమకొల్పుతూవుంది. ఎక్కడా దెబ్బతిన్న జాడే లేదు. 'ఎవడో మంచి పనివాడు చంపాడు' అనుకొన్నాను కళాకారుడికోసం క్రింద గుమిగూడిన జనంలో వెతుకుతూ.

అంతా కోలాహలంగా ఒరియా భాషలో మాట్లాడు కుంటున్నారు క్రింద.

'తాచుపామా?' అని అడిగాను ఇంగ్లీషులో, డాబా పిట్ట గోడమీద నా ప్రక్కనే కూర్చున్న సాహూని.

క్రింద జనంతో మాట్లాడుతున్న సాహూ నా వైపు తిరిగి, 'చాలా ప్రమాదకరమైన తాచు. సంకరజాతి నాగు' అన్నాడు.

సాహూ మా ఇంటి యజమాని. నేను నా ఉద్యోగధర్మంలో ఈ వూరువచ్చి అప్పటికి రెండురోజు లయింది. ఆ రెండురోజులూ సాహూ ఎంతో సాయంగా ఉండేవాడు. నా కీ వూరు కొత్త. భాష కొత్త.

క్రింద జనంతో హడావుడిగా ఏమిటేమిటో మాట్లాడేస్తున్నాడు సాహూ.

విజృంభిస్తున్న ఆసక్తిని అణచలేక "ఎవరు చంపారు? ఎక్కడ?" అని అడిగాను.

"అదిగో, ఎడంచేతివైపు నాలుగో ఇల్లు లేదూ? ఆ ఇంట్లో కొచ్చిందట. వంట చెరకు పెట్టుకొనే గదిలో ఉందట. ఇంటామె చూచి బయటికివచ్చి, కేకలువేసింది. ప్రక్కఇంటికి ఏదో పనిమీద వచ్చిన పరీడా విని పరుగెత్తుకు వెళ్లిదాన్ని చంపేశాడు" అన్నాడు సాహూ, పాముని చంపడమంటే ఏదో ఆట ఆడినంత తేలికైన విషయమైనట్లు.

"అడుగో, అతనే పీతాంబర్ పరీడా" అని క్రింద జనంలో ఒక వ్యక్తిని చూపించాడు.

బట్టతల, నీలంరంగు లుంగీపంచ, నల్లగా, సన్నగా, పొడుగ్గా, నడివయస్సులోవున్న పీతాంబర్‌పరీడాని చూశాను. ఒక చేతిలో సన్నటి పొడుగాటి ఈటె, రెండవ చేతిలో లావుపాటి కర్ర. ఈటె అందరికీ చూపిస్తున్నాడు, పాముని ఎలా చంపినదీ వర్ణిస్తూ.

చుట్టూఉన్న పూరికొంపల్లోనుండి జనం బిలబిలమంటూ వచ్చి పరీడా చుట్టూ గుమిగూడి ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఏవో ఇతర పాములని గురించి కూడా చర్చిస్తున్నారంతా. ఆ ప్రాంతంలో పాములు బాగా ఎక్కువ అని సాహూ చెప్పాడు.

'ఎలా చంపాడు? ఆ ఈటె ఏమిటి?' అని అడిగాను. సాహూ ఇలా చెప్పాడు.

"పాముని కొట్టడంలో పీతాంబర్‌పరీడాని మించిన వాడు ఈ చుట్టు ప్రక్కలలేడు. ఎంత పామునైనా ఒక్కడూ అవలీలగా చంపగలడు. అది ఒక విద్యగా అభ్యాసం చేశాడు. అదుగో ఆ ఈటే, ఆ కర్రా ఎప్పుడూ కూడా ఉంటాయి అతనికి. ఆ ఈటెతో పాము తలమీదకాని, మెడమీదకాని ముందు పొడుస్తాడు. అలా పాముని అణచిపెట్టి రెండో చేతిలోని దుడ్డు కర్రతో ఒక్క దెబ్బకొట్టి చంపేస్తాడు. అలా వందలకొద్దీ పాముల్ని చంపేడు" అన్నాడు ఉత్సాహంగా.

ఒక్కక్షణంఆగి, గొంతు తగ్గించి, "పాముల్ని చంపడం కోసమే జీవిస్తున్నానంటాడు. అంత పగ!" అన్నాడు గాఢమైన నిట్టూర్పుతో.

జనమేజయుడి సర్పయాగం జ్ఞాపకం వచ్చింది నాకు.

క్రింద పరీడా పాముని కసిగా అటూ, ఇటూ పొర్లిస్తున్నాడు. బతికున్నపాములాగే మెలికలు తిరుగుతూందది.

ఆ దృశ్యం ఇంకా కళ్ళకు కట్టినట్లుగాఉంది. పరీడాని నేను అదే మొదటిసారి చూడడం. తర్వాత కొద్ది రోజుల్లోనే ఇద్దరమూ చాలా దగ్గరగా వచ్చాము. ఇక అతన్ని చూడలేనంటే ఏమిటో బాధగావుంది.

"అతనికథ చాలా విచిత్రమైనది. ఇప్పటికే చాలా రాత్రయింది. టూకీగా చెబుతాను వినండి"—వాచీ చూసుకుంటూ ఇలా మొదలెట్టాడు సాహూ.

"ఊరిచివర తోటలో పూరింట్లో పీతాంబర్ పరీడా నివాసం. రెండేళ్లక్రితంవరకూ అందులో అతడూ, పదహారేళ్ల కొడుకూ ఉండేవారు. పరీడా భార్య కొడుకు అయిదవఏటనే కన్ను మూసింది. ప్రాణాలన్నీ కొడుకుమీదనే పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచాడు పరీడా. కొడుకు చేతికందొచ్చి వ్యవసాయపు పనిలోనూ, తోటపనిలోనూ సాయపడేవాడు. ఈడైనపిల్ల నెవరి నైనాచూసి, అతడికి పెళ్ళి చేసేద్దామన్న ఆలోచనలో ఉండగా ఒకనాడు రాత్రి ఆ కుర్రవాణ్ణి నిద్రలో ఉన్నవాడిని నాగుపాము కాటేసింది. పరీడా లేచేసరికి పాము తూములో దూరిపోతూ కని

పించింది. కొడుకు నురగలు కక్కుతూ, గిలగిలలాడుతున్నాడు. ఇంకో అరగంటలో అంతా అయిపోయింది. కుప్పకూలిపోయాడు పరీడా. ఆ తోటలో పెద్ద తాచుపాము తిరుగుతున్నదని అతనికి తెలుసు. ఆ పాము అతనికి గుర్తే. అయితే అది పని గట్టుకుని ఇంట్లోకి వచ్చి కొడుకుని పొట్టబెట్టుకుంటుందని అతడు కలలో కూడా అనుకోలేదు. 'జాతైన నాగుకదా! దాని జోలికి మేం పోనప్పుడు మా జోలికిమాత్రం అది ఎందుకు వస్తుంది?' అంటూ అశ్రద్ధ చేసేడు. ఆ అర్ధరాత్రి దుఃఖంతోనూ, ఆవేశంతోనూ వూగిపోతూ కొడుకు శవంమీద ప్రతిజ్ఞ చేశాడు పరీడా, 'తన కొడుకుని చంపిన పాముని హతమారుస్తాననీ, నాటినుండీ పాముల్ని నాశనం చేయడమే తన జీవిత పరమావధి అనీనూ. అప్పటినుండి పాములకు ప్రబల శత్రువయ్యాడు పరీడా. ఈటె, కర్రా పట్టుకుని అతను తిరుగుతుంటే గరుడుని అపరావతారంలాగే ఉంది ఈ ప్రాంతం జనానికి. అతని ఇంటికి వెడితే వందలకొద్దీ పాము చర్మాలు చూడొచ్చు. మీ భాషకూడా బాగా మాట్లాడుతాడు" అని ముగించాడు సాహూ.

తెను గొచ్చిన వాడొకడు ఈ వూళ్లో ఉన్నాడంటే ప్రాణం లేచి వచ్చింది. ఇక్కడ సాహూలాటి వాళ్లిద్దరు ముగ్గురు ఇంగ్లీషు వచ్చినవారున్నారు. వాళ్లతోనే నాకు కాలక్షేపం. మర్నాడే సాహూతో కలిసి పరీడా ఇంటికి వెళ్లాను. పరీడా తెలుగు—తెలుగువాడిలాగే మాట్లాడేవాడు. తన చిన్నతనమంతా బరంపురంలోనే గడచిందని చెప్పాడు. తోటంతా తిప్పిచూపించాడు. తరచుగా వస్తూ ఉండమని ఆహ్వానించాడు. నవ్వుతూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. ఇంట్లోకి తీసుకువెళ్ళి ఏవో పళ్లూ, కాయలూతెచ్చి ఆతిథ్యమిచ్చాడు. మేము కూర్చున్న గది గోడలనిండా రక రకాల పాము చర్మాలు వందలకొద్దీ వ్రేలాడుతున్నాయ్. అందులో కొన్ని ఎంత అందంగా ఉన్నాయని! నేను వాటికేసి ఆసక్తితో చూడడం గమనించి, ఇది తెల్లతాచు, ఇది నల్లతాచు, ఇది గోధుంతాచు, ఇది పొడపాము అంటూ ఒక్కొక్కటే చూపించసాగాడు. "వీటిలో మీకు నచ్చినవి తీసుకు వెళ్ళవచ్చు బాబూ" అన్నాడు.

"నాకెందుకు, నేనేం చేసుకుంటాను వీటిని" అన్నాను. సాహూ రెండు చర్మాలు తీసుకున్నాడు. ఇప్పుడనిపిస్తుంది నేనూ ఏదో ఒకటి తీసుకుంటే పరీడా పేరున జ్ఞాపకచిహ్నంగా ఉండునే అని.

* * * *

మనిషిమీద పాముపగ ఎరుగుదును. కాని, పాముమీద మనిషిపగ ఎప్పుడూ వినలేదు. ఆవేళ సాయంత్రం షికారుగా పొలాల్లోంచి వెడుతుంటే పరీడా వెంబడించాడు. అతడికథ కొంత కొంత అతడి నోట కూడా విన్నాను. "ఆ మాయదారి పాముమీద పగబట్టాను బాబూ. అదేనా చావాలి నేనేనా చావాలి" అన్నాడు చేతిలో ఈటె ఝుళిపిస్తూ. ఆ మాట అంటుంటే ఎప్పుడూ నవ్వుతూ, సౌమ్యంగా ఉండే పరీడా ఒక్కమారుగా బుసలుకొడుతున్న మహానాగంలా కనిపించేడు.

నేను రోజూ సాయంత్రం అదే ప్రదేశానికి నడిచేవాడిని. అక్కడ ప్రకృతి చాలా రమ్యంగా ఉండేది. గుబురు గుబురుగా పెరిగిన పొదలూ, కొమ్మలు కనపడనంత దట్టమైన ఆకులతో పెద్ద పెద్ద చెట్లూ, నీరేమోనని భ్రాంతి కలిగించే సరుగుడు తోటలూ, చెట్ల ప్రతిబింబాలతో తోటేమోనని భ్రమ గొల్పే నదీ, చల్లనిగాలీ, అన్నిటికన్నా నాకెంతో ఇష్టమైన 'పీకహా' అనే పిట్టపాట, ఇవన్నీ ఉండేవి. అక్కడికి ఏ రోజైనా వెళ్ళకపోతే ఏదో వెల్తిగా ఉండేది. పరీడా తోటనానుకొనిఉన్న ఎత్తైన గట్టు నా మార్గము. ఆ దారిని ఎప్పుడు వెడుతున్నా పరీడావచ్చి "బాబుగారు ఒక్కరూ వెళ్ళకూడదు. అన్నీ పాడుపాములు" అంటూ నాకూడా నడిచేవాడు. తిరుగు ప్రయాణంలో నన్ను తోట దాటించి మరీ ఇంటికి వెళ్లేవాడు. దారి పొడుగునా ఎన్నో కబుర్లు చెప్పేవాడు. తాను ఏ పాముని ఎలా చంపినదీ, అభినయయుక్తంగా వర్ణించేవాడు. అయితే ఎన్ని కబుర్లు చెప్పినా, సంభాషణ చివరికి తాను పగబట్టిన పాము దగ్గరకే వచ్చేది. దానికోసం ఆరోజు తాను ఏ యే ప్రదేశాలు వెదకినదీ చూపించేవాడు.

ఒకరోజున గట్టు వెంబడి నడుస్తుంటే హఠాత్తుగా ఒకచోట ఆగిపోయి, ఎంతో ఆవేశంతో 'అదిగోబాబూ, అదిగో' అని అరిచాడు పరీడా. పామేమో అని హడలిపోయాను నేను. అయితే అతని ఈటె పైకి లేవకపోవడం గమనించి నిల్రదొక్కుకుని తాపీగా పరిశీలించాను. మెలికలు తిరుగుతూ గట్టుకి అడ్డంగా కనిపించింది పాముజాడ. గట్టుకి ఇటు పొదలు, అటు పొదలు. ఒక పొదలోనుంచి ఇంకో పొదలోనికి వెళ్ళిందన్నమాట పాము. అయితే ఎటునుంచి ఎటు వెళ్ళిందో మాత్రం తెలియలేదు. పరీడా గట్టుదిగి అటూ ఇటూ కూడా జాగ్రత్తగా పరిశీలించాడు. ముందురోజు వర్షం పడడంచేత ఇంకా తడి తడిగా కొద్దిగా జారుగావున్న గట్టుమీద మాత్రమే రెండు మూడు అడుగుల మేర ఉంది ఆ జాడ. ఆపైన అటూ ఇటూ కూడా ఏ ఆనమాలూ లేదు. నా కిక అడుగు ముందుకు సాగలేదు. 'లాభంలేదు పరీడా. అది మనకోసం ఇంకా అక్కడ కూర్చుంటుందా. పద, వెనక్కి పోదాం' అన్నాను.

తర్వాత ఒకవారం రోజులవరకు అటు వెళ్లాలని అనిపించలేదు. ఒకరోజున వెడదామా వద్దా అని తటపటాయిస్తుంటే, పరీడాయే వచ్చాడు. ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ సంతోషంగా ఉన్నాడు. 'ఒకవేళ పామునిగాని చంపేడా ఏమిటి చెప్మా' అనుకుంటూ "రా, రా, పరీడా, ఇలా కూర్చో" అన్నాను బల్ల చూపిస్తూ. ఈటె కర్రా గోడకి జేర్లవేసి కూర్చున్నాడు.

ఒక్క నిమిషం గోడలకున్న పటాలూ, అవీ చూస్తూ కూర్చుని 'నిన్న చూశాను బాబూ, ఆ ఎదవని' అన్నాడు.

ఎవరిని గురించి మాట్లాడుతున్నాడో తెలుసుకోవడం పెద్ద కష్టంకాలేదు నాకు.

"ఏం, ఎక్కడ కనిపించింది?" అన్నాను ఆసక్తి కనబరుస్తూ.

"నిన్న గట్టుప్రక్క గడ్డి కోస్తుంటే పొదల్లోకి దూరిపోతున్నదానితోక కనిపించింది బాబూ. ఈటె పుచ్చుకుని లేచే

సరికి అప్పటికే దాటిపోయింది. ఆవేళ మనం జాడ చూశామే అక్కడికి దగ్గరే బాబూ.'' అన్నాడు.

ఏమిటీ మనిషి? పాము తోక కనిపిస్తేనే ఇంత సంబర పడుతున్నాడే తప్పిపోయిన ఏకైక పుత్రుడు దొరికితే తల్లి తండ్రుల లాగ. ఏమిటీ అనుబంధం? అనుకొన్నాను.

''దానిజాడ దొరికింది బాబూ. దాని ఆనుపానులు తెలిశాయి. ఇక అక్కడే మాటువేస్తాను'' అన్నాడు.

''నువ్వక్కడవుంటే అది అలా వస్తుందా'' అన్నాను.

''అంటే అక్కడ కూర్చుంటానా బాబూ? ఆ గట్టుమీద ఒక కన్నేసి తిరుగుతూంటా నన్నమాట'' అన్నాడు పరీడా నా అమాయకత్వానికి జాలి పడుతున్నట్లు.

నాలుగైదు రోజుల తర్వాత ఒక రోజున బజార్లో హఠాత్తుగా కనిపించాడు. ''ఏం పరీడా, బొత్తిగా నల్లపూసైపోయావు' అన్నాను.

''ఆ ఎదవతో చచ్చీ చావుగాఉంది బాబూ. ఏడిపించుకు తింటూంది'' అన్నాడు.

''ఏం చేసిందేమిటి?'' అని అడిగాను.

''కనిపించినట్లే కనిపించి మాయమౌతుంది బాబూ. ఈవాళ చూసినచోట రేపుండదు. మా దొంగ నాగు బాబూ'' అన్నాడు.

అసలు ఎక్కడ కనిపించిందని నే నడిగేలోగానే మళ్లీ అందుకున్నాడు.

''మొన్న తమ ఇంటిదగ్గరనుంచి వెడుతుంటే గట్టుమీద నాకు మూడు గజాలదూరంలో నా దారి కడ్డుగా పాకిపోయింది బాబూ. ఒక్క ఉరుకులో ముందుకువెళ్ళి చూశాను. ఎక్కడా దాని జాడే లేదు. ఈమధ్య రోజూ కనిపిస్తూంది. ఏ పొదలోనో దూరిపోతూనో, దారి కడ్డుగా పాకి మాయమయిపోతూనో, కోరడుదాటి ప్రక్కతోటలోకి పోతూనో ఏదోవిధంగా కళ్లపడుతూంది. కాని దొరకటంలేదు బాబూ'' అన్నాడు.

చిరునవ్వుతో ''అస్తమానమూ అదే ధ్యానలో ఉండడం వల్ల భ్రమపడుతున్నావేమో పరీడా'' అన్నాను.

పరీడా నవ్వాడు.

* * * *

మరునాడు తోట ప్రక్క గట్టుమీద నా కూడా నడుస్తూ ''ఒక మంచి పథకం తయారు చేశాను బాబూ. ఈ దెబ్బతో ఆ యెదవ నా చేతిలో చిక్కాలిసిందే'' అన్నాడు పరీడా దండయాత్ర పథకం సిద్ధంచేసిన నెపోలియన్‌లా మొఖం పెట్టి. నాకు కూడా ఈ విషయంలో ఆసక్తి నానాటికి ఎక్కువౌతున్నది.

అతని సాహచర్యంవల్లనో ఏమో ఆ పాము నాకుకూడా శత్రువులా కనిపించసాగింది. దానిమీద పరీడాతోపాటు నేను కూడా కక్షకట్టినట్లుగా అనిపిస్తున్నది. ఇప్పుడు మేమిద్దరం కలిసి సాధించవలసిన విరోధిఅన్నమాట ఆ పాము. అయితే సంఘర్షణ ఏదన్నా జరిగితే పరీడాకు నేనివ్వగలిగినదంతా నైతిక సహాయం మాత్రమే. పరీడా ఇంకా వ్యూహరచనలో మునిగిపోయిన సేనానాయకుడి భంగిమలోనే ఇలాఅన్నాడు.

''దాన్ని పట్టుకోవాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా అది దొరకటంలేదు బాబూ. ఇది పనిగాదన్న నమ్మకంలోకొచ్చాను. ఈమారు అదేనన్ను వెదుక్కుంటూ వచ్చేలా చేస్తాను. నేను ఎక్కడున్నా చచ్చినట్లుగా నా కాళ్ళదగ్గరకు రావాలి. ఈ దెబ్బతో అదేనా పోవాలి. నేనైనాపోవాలి.'' అన్నాడు.

టాల్‌స్టాయ్ వ్రాసిన 'వార్ అండ్ పీస్' అనే నవలలో శత్రువుమీద దెబ్బతీయకుండా శత్రువునే మీది మీదికిరానిచ్చి దెబ్బతీసే 'కుటుజోవ్' అనే రష్యన్ సేనాని గుర్తుకొచ్చాడు.

''అంటే ఏం చేద్దామని ?'' అని అడిగాను.

''తమరు చూస్తారుగా తమాషా'' అన్నాడు గారడీ చేయబోతున్నవాడిలా.

చీకట్లు అన్నివేపులనుంచి వేలకొద్దీ నల్లతాచుల్లా మీది మీదికి వస్తున్నాయి. వెనక్కితిరిగి ఇంటివేపు నడువసాగాము. కొద్దిదూరంలో నక్కలు బృందగానం చేస్తున్నాయి. నా టార్చిలైటు సహాయంతో తొందరతొందరగా అడుగులు వేస్తున్నాము.

గట్టుప్రక్కగా ఏదో మిల మిలా మెరిసినట్లయింది. టార్చిలైటు అటు బాగా ఫోకస్‌చేశాను. వడివడిగా గట్టుక్రిందకు జారిపోతున్నది పాము.

''అదే బాబూ, అదే,'' అంటూ అరిచాడు పరీడా. మరుక్షణం చేతిలో ఈటె గురిచూసి దానిపైకి విసిరేడు. అప్పటికే పాము పొదల్లో దూరిపోయింది. పొదప్రక్కగా పడింది ఈటె. అది పాముకు తగిలిందన్నాడు పరీడా. నాకూ అలాగే అనిపించింది. నెమ్మదిగా గట్టుదిగి టార్చిలైటు సహాయంతో ఈటె తెచ్చుకున్నాడు.

తోట దాటేవరకు మౌనంగా నడిచాము. నాకు వీడ్కోలు చెపుతూ ''ఈ రాత్రితో తేలిపోతుంది బాబూ'' అన్నాడు పరీడా.

''జాగ్రత్త, పరీడా. పగబట్టిన తాచు. ఎంతో మెలకువ అవసరం.'' అని హెచ్చరించి ఇంటివైపు నడిచాను.

తెల్లవారగానే దంతధావన చేసుకుంటూంటే పరీడా ప్రత్యక్షమయ్యాడు.

''రాత్రల్లా నిద్ర పాడయింది బాబూ. ఎంత ఎదురు చూసినా ఆ యెదవ రానేలేదు. ఈటె తగల్లేదో ఏమోమరి. లేకపోతే పగబట్టకూడ దనుకుందో.'' అన్నాడు.

''పూర్వజన్మలో ఎవరో గొప్పజ్ఞానియై వుంటాడు నీ మిత్రుడు. పగను పగతో జయించలేము అనేమో ఆయన వుద్దేశం.'' అన్నాను ఛలోక్తిగా.

పరీడామొహం ఎర్రగా చేసేకుని ఇలా అన్నాడు.

"అవునుబాబూ. నిద్రపోతున్న పసివాడిని కాటేసి దొంగ లాగ మొహం చాటుచేసుకుని తప్పుకు తిరగడమేకాబోలు జ్ఞాన మంటే. చేవవుంటే ఎదరకువచ్చి నిలబడాలి."

నేనేదో తమాషాగా మాట్లాడితే ఇలా సీరియస్‌గా తీసు కుంటాడనుకోలేదు. తన శత్రువు పాము అన్నమాటమరచి ఎవరో మనిషినిగురించి మాట్లాడినట్లుగావుంది అతని ధోరణి. 'ఈ పగ మూలంగా ఇతనికి పిచ్చిగాని ఎత్తడంలేదుగదా' అన్న ఆలోచన ఒక లిప్తసేపు మనసులో మెరసింది. అయినా "అది మనిషి కనకనా పరీడా, ఇలాటి ఆలోచనలన్నీ వుండడానికి— కాటేయ డమే దానికి తెలుసుకాని, కావాలని తప్పుకు తిరగడం, ఎదుటబడి సవాలు చేయడం, ఇవన్నీ ఏం తెలుస్తాయి చెప్పు." అన్నాను అనునయంగా.

పరీడా కొద్దిగా చిరాకుతో "తమరికి తెలీదుబాబూ. అన్ని పాములలాటిదికాదు ఇది. దీని తరహాయేవేరు. నేను వందల కొద్దీ పాముల్ని ఎరుగుదును. వాటిసంగతి నాకు తెలుసు" అన్నాడు చివరి రెండుమాటల్ని నొక్కిపలుకుతూ.

ఇలాటి విషయాల్లో అభిప్రాయాలు ప్రకటించడానికి నాకు అర్హతలేదన్నధ్వని అందులోవుంది.

నేనిక నోరెత్తలేదు.

అసలు పరీడా ఈ పాముని ఎలా గుర్తుపట్టగలుగు తున్నాడో అప్పటికీ ఇప్పటికీ నాకు అవగాహన కాలేదు. నాకు అన్ని తాచుపాములు ఒక్కలాగే కనిపిస్తాయి. అందులో తోట ల్లోనూ పొలాల్లోనూ ఎన్నోపాములు తిరుగుతుంటాయి. వాటిలో తనకు కావలసిన పాముని అతడు దూరంనించే ఎలాగుర్తుపట్ట గలుగుతున్నాడోమాత్రం అర్థంకాని విషయమే. ద్వేషం లోనూ పగలోనూవుందేమో ఆ శక్తి. పగవల్ల మేధ పదునెక్కి లైట్ ఫోకస్‌లా సర్వశక్తులూ ఒక్క విషయంమీద కేంద్రీక రించుకుంటాయి కాబోలు.

తాను ఎన్ని పాములనో చంపాడు. అయినా తనకు కావల సినపాము దొరకదు. ఎండమావులలాగ అతన్ని కవ్వించి కవ్వించి మాయ మయిపోతుంది.

పరీడా ఓపిక రోజు రోజుకి క్షీణించిపోతుంది. మనిషి కూడా మునుపటిలాగ ఇప్పుడు చిరునవ్వుతో కనపడటంలేదు. ఎప్పుడూ ఏదో మబ్బు కమ్మినట్లు బరువుగా ఉంటున్నాడు.

ఒకరోజున తోటలో కలుసుకున్నపుడు ఇలా అన్నాను. "ఇలా ఎన్నాళ్లు పరీడా? ఒక పాములవాడిని తీసుకువచ్చి ప్రయోగించ కూడదా? నాగస్వరానికీ, మంత్రానికీ లొంగని పాము ఉండదు కదా!" అని సలహా ఇచ్చాను.

పరీడా తల అడ్డంగా వూపుతూ, మొహం ఒక ప్రక్కకు తిప్పుకొని ఒక చేయి పైకెత్తి మేనక దగ్గర విశ్వామిత్రుడి పోజులో "అలా వీల్లేదు బాబూ. ఆ యెదవని ఈ చేత్తో నేనే చంపాలి. ఈ వ్యవహారం మా ఇద్దరి మధ్యనే తేలిపోవాలి. పాముల వాడూ, మంత్రగాడూ ఇందులో చొరబడ్డం నేను సహించను" అన్నాడు. ఖండాయత్ (క్షత్రియకులం) బిడ్డ పరీడా, ఇంకో విధంగా ఎలా మాట్లాడతాడు?

నాగస్వరం పాముని బయటికి తీసుకు రావడానికేననీ, అది ఎదుటికి వచ్చాక, దానితో తానే పోరాడి చంపవచ్చుననీ నచ్చ చెప్పడానికి ప్రయత్నించినా లాభంలేకపోయింది. అసలు ఈ వ్యవ హారంలో ఇంకో మనిషి జోక్యం సహించడతను. ఇదేమి పూర్వజన్మ సంబంధమోమరి.

ఆవేళ వాహ్యాళి పూర్తిచేసుకుని తిరిగివస్తున్నాం. దూరంగా మామిడి గుబురుల్లో 'పీకహాఁ పిట్ట పీకహాఁ (ప్రియుడు ఎక్కడ), పీకహాఁ అంటూ తన ఆవేదన అంతా వలకబోస్తూ, మధురంగా గానం చేస్తూంది. గుండెలు పిండుతూ ఎంత విషాదం ఆ ఆక్రంద నంలో! గడచిన రెండు మూడు రోజులు పడ్డ వర్షంవల్ల నేల అక్క డక్కడ చాలా జారుగావుంది. గట్టుకి ఒక ప్రక్క ఎత్తుగా దైవ జ్ఞుల్లా తలలు వంకిస్తున్న వెదుళ్లతో పెద్ద వేణువనం. రెండవ ప్రక్క అరటితోట. ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు. చల్లగా తేమగాలి, ఎవళ్ల ఆలోచనల్లో వాళ్లం ముడుచుకుపోయి నడు స్తున్నాము. జారకుండా జాగ్రత్తగా రాళ్లమీద అడుగులేస్తూ నడుస్తున్నాము. హఠాత్తుగా ప్రక్కన ఏదో అలికిడైంది. నేను ప్రక్కకు తిరిగి చూచేసరికి పరీడా నా ప్రక్కలేడు. మెరుపు మెరిసినట్లు గట్టుదిగి వేణువనంవైపు పరిగెత్తాడు అప్పుడే. నేను సర్దుకొని చూచేసరి కప్పుడే అతని ఈటె పైకి లేవడం, బుస్సుమన్న శబ్దంతో క్రిందకు దిగిపోవడం జరిగిపోయింది. కంగారుగా ఏం చేస్తున్నానో తెలియకుండా నేనూ కిందకి పరి గెత్తాను. పరీడా క్షేమంగానే ఉన్నాడు. ఒక ఎత్తైన పెద్ద రాతి బండమీద నిలబడ్డాడు. ఎవడో రాక్షసుడి నిట్టూర్పులలాగ పాము బుసలు ఎడతెరిపి లేకుండా వినిపిస్తున్నాయి. రాతిమీదెక్కి క్రిందకి చూచాను. గొడుగులాటి పెద్ద పడగతో పైకిలేచి బుస కొడుతున్నది పెద్దతాచు. మేము దానికి ఒక అడుగుపైన ఉన్నాము. శివమెత్తినట్లుగా వూగిపోతున్నది నాగు. విలవిలలాడిపోతున్నది. రాతిని కాటేస్తున్నది. పరీడా ఈటె దాని తలకు తగలవలసినది. కొద్దిగా గురితప్పి నడుముకు కొంచెం ప్రక్కగా గుచ్చుకొంది. అందుకనే పాము విజృంభించింది. అయితే ఈటెతో నొక్కిపెట్టి ఉంచడంవల్ల అంతకన్న పైకి లేవలేకుండా ఉన్నది. ఈటెచుట్టూ చుట్టుకుపోతున్నది ఒకమారు. మరుక్షణంలో కొరడాలా బయ టికిపడి పడగతో లేస్తున్నది. పరీడాకి కూడా పరిస్థితి వీలుగా లేదు. రెండో చేతిలోని కర్ర ఉపయోగించడానికి వీలు చిక్కడం లేదు. వగరుస్తూ, "దొరికిందిబాబూ, దొంగ యెదవ" అన్నాడు. అదే అనుకుంటా అతడు నాతో మాట్లాడిన ఆఖరిమాట. పాముని పరికించి చూచాను. చాలా గొప్ప తాచు. నేను పరీడాని మొట్ట మొదటగా చూచినప్పటిపాముకన్న పెద్దపామే. కాలసర్పంలా విషం కక్కుతూ అది విజృంభిస్తుంటే నాకు కాళ్లు వణికేయ్. పరీడా రొప్పుతూ కర్రపట్టిన రెండవ చేతితో కూడా ఈటెనుపట్టి

యావచ్ఛక్తి ఉపయోగించి, దానిని నొక్కిపెడుతున్నాడు. ఈటెను చుట్టపెట్టుకుని, దానిని కిందకు లాగేస్తున్నది పాము. పరీడా చేతులు వణకడం గమనించాను. అతని శక్తి క్రమేపీ క్షీణిస్తున్నట్లనిపించింది. అయినా సహాయం చేద్దామన్నా చివరకు సమీపిద్దామన్నా ధైర్యం చాలలేదు నాకు. అతనూ ఒక మహా సర్పంలా కనిపించాడు ఆ క్షణంలో. ఆ సమయంలో పరీడా మానుషాతీతమైన శక్తిని ప్రదర్శించాడు. చేతిలో కర్ర జారవిడిచి, ఈటెను రెండు చేతులతోను గునపంలా పట్టుకొని పాముని హింసించసాగాడు. దృశ్యం మహాభీకరంగావుంది. గిలగిలలాడుతూ, చిత్రంగా మెలికలు తిరిగిపోతూ, రెండు మూడుమార్లు పరీడా మీదికి ఉవ్వెత్తుగా లేచింది నాగు. నాలుగయిదు అంగుళాల తేడాలో ప్రమాదం తప్పింది. ఆ రెండు మూడు పర్యాయాలూ అది రాతిని కాటేసింది. కాసేపు భయంకరంగా మృత్యుతాండవంచేసి, ఆ పాము చివరకు అంత ఎత్తునుంచీ ప్రక్కనేవున్న రాతిమీద పడగ వేసి కొట్టుకుంది. అలా ముమ్మారు కొట్టుకుని మరి లేవలేదు. తల పూర్తిగా చితికిపోయింది. జాతైన తాచు శత్రువుచేతిలో చావడం ఇష్టంలేక ఆత్మహత్య చేసికొన్నది.

పరీడా ఈటే కర్రా రెండూ దూరంగాగిరవాటేసేడు. రెండు చేతులతో తలపట్టుకొని, జుట్టు పీక్కుని వెనక్కు తిరిగేడు. సర్వస్వమూ కోల్పోయినవాడిలా, పిచ్చివాడిలా, నన్నేనా గమనించకుండా నడచిపోసాగాడు. నా కంతా దిగ్భ్రమగాఉంది. అసలీ పాము పోరాటంతోనే నాకు సగం మతిపోయింది. దానినుండి ఇంకా కోలుకోకుండానే పరీడా వింత ప్రవర్తనవల్ల నాకు పూర్తిగా మతిపోయినట్లనిపించింది.

తన చిరకాల వాంఛితం నెరవేరింది. ప్రబల శత్రువు మరణం కళ్ల చూశాడు. మరి ఈ అస్త్రసన్యాసమేమిటి? ఈ నిస్పృహ ఎందుకు వచ్చింది? అంతా అగమ్య గోచరంగావుంది.

వెనుకనుంచి అతని జబ్బ పట్టుకొని, "ఏం పరీడా, ఏం జరిగింది?" అని అడిగాను కంపిస్తున్న కంఠంతో.

పరీడా బదులు పలకలేదు. పైగా నే నెన్నడూ అనుకోని విధంగా ప్రవర్తించాడు. నా చేతిని మోటుగా విసరికొట్టి, విసవిస నడచిపోయాడు. ఖిన్నుడనయ్యాను. "పోనీలే. ఆవేశంనుండి ఇంకా తేరుకోలేదన్నమాట. మెమ్మదిగా అతనే సర్దుకొంటాడు" అనుకొని మా ఇంటివైపు నడిచాను.

* * * *

మర్నాడు స్నానాదికాలు ముగించుకొని బయటికి వెళ్లేదుస్తులు వేసుకుంటుంటే సాహూ ఆదరా బాదరాగా పరుగెత్తుకొనివచ్చి, "ఈ సంగతి విన్నారా, పాపం! పరీడా చచ్చిపోయాడట" అని కేకేశాడు. పిడుగు పడ్డట్టుగా అయి మ్రాన్పడిపోయాను. "మా పాలికాపు ఇప్పుడే మోసుకొచ్చాడు ఈ వార్త. గట్టుమీద నడుస్తూ కాలుజారి పడిపోయాడట. కింద రాతిబండ తగిలి తలపగిలిపోయిందట. తెల్లవారేటప్పటికి శవం కనిపించిందట" అన్నాడు.

"అరే, చిన్న సాయంత్రమే ఆ పాముని చంపేడే. పదండి చూద్దాం" అంటూ బయలుదేరాను. సాహూ, అతని పాలికాపు కూడా వచ్చారు. గట్టు అక్కడక్కడ చాలా జారుగా ఉన్నమాట నిజమే. కాని, పరీడా జారిపడ్డాడంటే నాకు నమ్మకం కలగలేదు. ఎన్నో సంవత్సరాలు ఆ గట్టుమీద నడిచిన పరీడా, ఇప్పుడు జారి పడ్డాడంటే అంత తేలికగా నమ్మలేకపోయాను. వేణువనం దగ్గర కొచ్చాము. గట్టుకింద దూరంగా పరీడా పారేసిన ఈటే కర్రా అలాగే ఉన్నాయి. అక్కడికివెళ్ళి బండమీదెక్కిచూశాము. కింద రాతిమీద పగిలిన తలతో బ్రహ్మాండమైన ఆ తాచు నిర్జీవంగా పడిఉంది. ఇప్పుడు కొద్దిగా తాపీగా చూడగలిగాను. రెంచు గజాలు మించిన పొడవు. వర్ణించడానికి వీల్లేని చిత్రమైన రంగు. ఈ రకం తాచుని ఇంతకుముందు నేను చూడలేదు. పరీడా ఇంట్లో ఉన్న చర్మాలలో కూడా ఇటువంటిది లేదు. నడుంమీద పరీడా ఈటె గుచ్చుకొన్నచోట గాయం స్పష్టంగా కనిపిస్తున్నది.

మళ్లీ గట్టెక్కి ముందుకు నడిచాము. మూడు ఫర్లాంగుల కవతల పరీడా శవం కనిపించింది. బాగా నిటారుగాఉన్న గట్టుకింద రాతిమీద పగిలిన తలతో బోరగిలాపడి ఉన్నాడు. పరీడా. ఎందుకనో చటుక్కున పరీడాకు బదులు ఆ పామే అక్కడ పడి ఉన్నట్లనిపించింది. కన్నులు నులుముకొని చూశాను. పరీడా తలపెట్టిన సర్పయాగం చివరికి ఆత్మ బలిదానంతో సమాప్తమయింది. అతని పగతీరిపోయింది. ఇక విశ్రాంతి తీసుకొంటాడు. నా కన్నులు చెమ్మగిలాయి.

గుండెల్లో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్లయింది. నేను ముందురోజు ఇంటికి వచ్చెయ్యకుండా పరీడాతో ఉన్నట్లయితే ఇలా జరిగేది కాదేమో అనిపించింది.

అయినా పరీడా ఎందుకిలా చేశాడు?

నాగు ఆత్మహత్య చేసికొని, తన్ను పరాభవించిన అవమానం భరించలేక, తానూ ఆత్మహత్య చేసికొన్నాడా? లేక తాను ఏ పగ కోసం ఇన్నాళ్లు జీవించాడో ఆ పగ తీరిన పిదప ఇక బతక నక్కర లేదనుకొన్నాడా? లేకపోతే నిజంగానే ప్రమాదవశాత్తూ కాలుజారి పడ్డాడా? ఇవేమీకాక, కథల్లోలాగ ఇదేమైనా సర్పశాపమా?

సమాధానం నాటికీ, నేటికీ దొరకలేదు.

కాని, రాతిమీద పగిలిన తలతో ఆనాగుపామూ, అల్లంత దూరంలో ఇంకో రాతిమీద పగిలిన తలతో పాములాగే బోరగిలా పడి ఉన్న పరీడా తరచుగా జ్ఞాపకం వస్తూనే ఉంటారు.